''ఈ ముసలాడికి తలదాచుకునేందుకు చోటు పోయే సరికి దెబ్బకు వేదాంతం వస్తుంది!'' అనుకుంటూ నవ్వు కున్నారు.

అంతలో ఏమైందో ఏమో.. ఎదురుగా ఉన్న గుడిలో కుడివైపు ఉన్న గోడ కూలిపోవడం.. అక్కడి జనాలు, గుడి పూజారులతో సహ హాహాకారాలతో బయటికి పరుగులు తీయడం క్షణాల్లో జరిగిపోయింది. కళ్లముందే అలా జరగడంతో రాజయ్య ఆశ్చర్యపోయాడు. కొందరు దెబ్బలతో హాస్పిటల్‌కు పరుగులు తీశారు. అప్పటిదాకా రాజయ్య మాటలు విన్న ఇద్దరూ.. లోపలికి వెళ్లి రాజ య్యను చూపెడుతూ ఏదో చెప్పారు. అంతే.. అక్కడివా రంతా 'స్వామీ!' అంటూ రాజయ్యను వెంటపెట్టుకుని లోపలికి తీసుకువెళ్లారు.

రాజయ్యకు ఆశ్చర్యంగా ఉంది.

'ఇదేంటి? వీళ్లంతా నన్ను స్వామి అంటారేమిటి?' అనుకుంటూ.. అదేమాట వారిని అడిగాడు కూడా!

''స్వామీ! మీరు ఇన్నాళ్లు ఈ గుడిలోనే ఉన్నారు. కట్టి నన్ని రోజులూ ఎదురుగా కూర్చుని.. అన్నీ గమనిస్తూనే ఉన్నారు. ఈరోజు మేం పెట్టిన భోజనం చేశారు. అలాగే ఏదో జరగబోతున్నదని మీరు అనడం వీరిద్దరూ వినడం.. వెంటనే గోడ కూలిపోవడం జరిగింది. మీరు అందరిలాంటి వారే అయితే.. అందరిలానే మరో నీడ కోసం వెళ్లిపోయేవారు. కానీ, మీరు రాత్రంతా ఈ గుడి ఆవరణలోనే ఉన్నారు. ఉదయమైతే గుడి ముందే ఉంటు న్నారు. మీరు మామూలు మనుషులు కారు. కారణ జన్ములు!'' అంటూ ఒకరి తర్వాత ఒకరు రాజయ్యకు నమస్కరించారు.

గుడి ఆవరణలో కూర్చోపెట్టారు. ఆ గోడను మళ్లీ కడుతూనే.. రాజయ్యకు అదే ఆవరణలో ఒక కుటీరం కట్టారు. రాజయ్యకు అంతా అయోమయంగా ఉంది. తనకేంటి ఇంత రాజభోగం అనేది అర్థం కావడంలేదు. ఎంత వారిద్దామనుకున్నా.. ఎవరూ వినే స్థితిలో లేరు.

ఇప్పుడు రాజయ్య కాస్తా.. రాజయ్య స్వామిగా మారి పోయాడు. ఉదయం నుంచి రాత్రి వరకూ భక్తుల ప్రశ్నల కోలాహలం. అతని దీవెన తీసుకుంటే జీవితాలన్నీ సుఖ మయం అవుతాయని.. పురిటికందు నుంచి వృద్ధుల దాకా అందరూ తమతమ ఆవేదనలు చెప్పుకొంటూ.. అతని దీవెనలు తీసుకునేవారే! అతని చేతి స్పర్శ సర్వ రోగ నివారిణి అని.. చిన్నా పెద్దా రోగుల దాకా అందరూ తనను తాకేందుకు త్వరపడేవారే! ఒకప్పుడు తినడానికి తిండిలేదు. నేడు తినలేనంత తిండి. పండ్లు, డబ్బులు ఒకటేమిటి? సర్వ సుఖాలు, సంపద రాజయ్య దగ్గరే!

'రాజయ్యా!' అంటూ రోజూ ఆత్మీయంగా వచ్చే మునెమ్మ కూడా క్యూలో నిల్చోవాల్సిందే! తెలియని ఆత్మీయతను పెంచుకున్న మునెమ్మ ఒంటరిదైంది. ప్రశాంతంగా మాట్లాడదామన్నా లోనికి రానీయరు. స్వామిని కలవాలంటే ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం పన్నెండు వరకు. ఆ తర్వాత స్వామి నిద్రం చేవేళ. మళ్లీ సాయంత్రం ఆరు నుంచి ఎనిమిది దాకా అనే సమయాన్ని కుదించారు. వద్దంటే నిద్ర. వద్దంటే తిండి. వద్దంటే గాలి, నీరు. అన్నీ అన్నీ.. ఇప్పుడు ఆప్యా యంగా ఏ జంతువూ దరికి రాదు. ఏ పక్షీ తనను పలక రించదు. స్నేహితులు లేరు. సన్నిహితులు అసలే లేరు.

* * *

ఏ కష్టం లేకుండా ఏడాది గడిచిపోయింది. ఒకరోజు రాత్రి పన్నెండైంది. రాజయ్యకు ఎంతో అసహనంగా ఉంది. ఒక పట్టాన నిద్ర రావడం లేదు. ఇదివరకే నయం.. అడుక్కుని తినేరోజుల్లోనే మంచినిద్ర పోయే వాడు. ఇప్పుడు తిండి ఎక్కువై నిద్ర రావడంలేదు. ఒక్క సారి ఆ శివుని కేసి చూశాడు.

'ఎంత పని చేశావయ్యా? నీలాగే నన్ను కూడా కట్టి పడేశావా? ఒక్కసారి నిన్ను హేళన చేశానని.. నీ జీవితం ఇలా ఉంటుందని నాకు చూపావా? అయ్యా! నువ్వు దేవుడివి. పైగా శిలవి. నేను మనిషిని. డబ్బు, విలాసం నేనెప్పుడూ కోరుకోలేదు. కాసింత నీడ కోరుకున్నా. ఏదో బతికినంత కాలం ఒక ముద్ద అన్నం కోరుకున్నా. నువ్వేమో ఏకంగా సుఖమంటే భయపడేలా చేస్తున్నావు. నాకెందుకయ్యా?' అని అనుకుంటూండగానే.. తలుపు చప్పుడైంది.

'ఎవరా!?' అని దీపకాంతిలో చూశాడు.

'ఎక్కడో చూసినట్లుందే!' అనుకోగానే.. ఒక్కసారిగా ఆనందం కట్టలు తెంచుకున్నది.

'శివయ్య! నా శివయ్య! నా కొడుకు వచ్చాడు!' అను కుని మెల్లగా వెనుక తలుపుగుండా బయటికి వెళ్లాడు.

తన కొడుకు, కోడలు, మనవలతో సహా!

''నాన్నా! ఎలా ఉన్నారు?'' అడిగాడు కొడుకు.

ఆ మాటకోసం ఎన్ని సంవత్సరాలు ఎదురు చూశాడో? ఎన్ని క్షణాలు ఉబికి వచ్చే కన్నీటిని గుండెల్లో దాచుకున్నాడో ఎవరికీ తెలియదు. మనవల్ని ఆప్యా యంగా తడిమాడు.

''రండి!'' అని పిలుస్తూ.. ఒక వారగా అందర్నీ చాపపై కూర్చోపెట్టాడు రాజయ్య!

''మీరెలా ఉన్నావురా?'' అంటూ.. దగ్గరగా ఉన్న పండ్లను చిన్నారులకు అందించాడు.

''మాకేం నాన్నా! హాయిగా ఉన్నాం. నేను నీ కోడలు హేమ కలిసి నెలకు రెండు లక్షలకు పైగా సంపా దిస్తున్నాం. కొత్త ఇల్లు కొన్నాం. పిల్లలు చదువుకుంటు న్నారు. నిన్ను రోజూ హేమ తలుస్తూ ఉంటుంది నాన్నా! నిజం! తను ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. ఎప్పుడూ.. 'మావయ్యగారు ఎక్కడున్నారో! ఏంటో!?' అనని రోజు లేదనుకో! అందుకే ఇలా ఈ రోజు. మళ్లీ ఉదయమైతే నీ హడావుడిలో మాట్లాడటం కుదరు తుందో లేదో అని ఇప్పుడు వచ్చాం. నీ గురించి పేపర్లో చాలా చదివాం. నువ్వు స్వామిగా మారడం నాకు చాలా సంతోషం అనిపించింది. సరే! మీ ఉనికి మీరు బాగానే పెంచుకున్నారు. ఈరోజు ఇలా ఉన్నారు. కానీ రేపు చూడండి.. పెద్దపెద్ద మంత్రులు కూడా మీ ఆశీస్సుల కోసం వస్తారు. అప్పుడు నాకు ఇంకా గర్వంగా ఉంటుంది. అందుకని..'' అంటూ ఆగిపోయాడు.

''ఆ అందుకని.. చెప్పు ఆగిపోయావేం?''.

''మీరు కూడా మాతోపాటు ఢిల్లీ వచ్చేస్తే.. మీకు ఇక్క డున్నట్లే కుటీరానికేం ఖర్మ! ఏకంగా బిల్డింగే కట్టిస్తాను. దాంతో మీ విలువ ఇంకా పెరుగుతుంది. ఇప్పటికన్నా ఆదాయం బావుంటుంది. నాకున్న డబ్బుకు మీ పరపతి తోడైందనుకో.. నాకు నేను ఎప్పట్నుంచో కలలు కన్న రాజకీయ జీవితం వస్తుంది. పిల్లల విలువ పెరుగు తుంది. మీకు తెలియనిదేముంది? ఇది పోటీ ప్రపంచం కదా? ఎవరైనా పైకి రావడం ముఖ్యం కానీ, ఎలా వచ్చాం అనేది ఎవరూ పట్టించుకోరు ఏమంటారు?''..

కొడుకు మాటలతో రాజయ్య మనసు ముక్కలైంది.

'నా అంతట నేను ఈ స్థితిని కలిగించుకోలేదురా!' అని చెబుదామనుకున్నా.. మాట బయటికి రాలేదు.

''మీరు వెళ్లండి! నేను రేపు సమాధానం చెబుతాను'' అని వారిని బయటికి పంపి.. గడియ పెట్టేసుకున్నాడు.

ఒక్కసారిగా వెక్కివెక్కి ఏడ్చాడు రాజయ్య! తన ఆవే దనంతా కన్నీటితో కడిగేసుకున్నాడు.

'వద్దంటే ఈ జీవితాన్ని నాకు అందించి.. నీ పక్కనే ఉంచుకున్నావు కదయ్యా! ఏనాటికైనా నన్ను తన వెంట తీసుకెళ్తాడనుకున్న నా కొడుకు ఇక ఎప్పటికీ మారడనీ, వాడికోసం ఇంకా ఆవేదన పడొద్దనీ ఈ రకంగా తెలియ జేశావు. ఏమాత్రం మనస్సాక్షి లేని కొడుకును నాకిచ్చావు కదయ్యా! నేనిక ఎవరికోసం బతకాలి? ఎందుకు బత కాలి? ఈ జీవితం ఇలాగే చాలిస్తే మేలేమో!' అను కుంటూ శివయ్యను వేడుకున్నాడు.

* * *

ఉదయం అయ్యేసరికి రాజయ్య చనిపోయాడనే వార్త ఊరంతా పాకింది. గుడి వీధంతా జనం నిండిపోయారు.

''స్వామీ! మమ్మల్ని వదిలి వెళ్లిపోయావా?'' అని వలవలా ఏడ్చారు కొందరు.

''స్వామి సమాధిలోకి వెళ్లిపోయాడు. ఆత్మ మాత్రం అక్కడే ఉంటుంది!'' అని తేల్చి చెప్పారు మరికొందరు.

ఏడాదిన్నర క్రితం రోడ్డుమీద అడుక్కుని బతికిన రాజయ్య.. నేడు రాజయ్య స్వామిగా మారి, అందరినీ కంట తడి పెట్టిస్తున్నాడు. విధి ఎంత విడ్డూరమైనది? మునెమ్మ మాత్రం ఏకధాటిగా రోదిస్తూనే ఉంది. మునె మ్మతోపాటు కిట్టయ్య కూడా ఏడవటం విశేషం.

* * *

కాలం ఎవరికోసం ఆగదు. ఆ స్థానంలో రాజయ్య రాతి విగ్రహం వెలిసింది.

'శివుని గుడికి రాజయ్య కాపలాగా ఉండేవాడట!?' అనే కథలు ప్రచారంలోకి వచ్చేశాయి.

ఏవైనా తీరని కోరికలు ఉంటే.. రాజయ్య శిలకు మొక్కితే తీరిపోతాయని నమ్మకం ప్రజల్లో ఏర్పడింది.

అప్పుడు రాజయ్యను. ఇప్పుడు ఆ శిలను మొక్కడ మైతే మానలేదు ప్రజలు. రానురానూ ఈ గుడికి ప్రచారం ఎక్కువైంది. ఆ గుడి ఎంతో మహిమ కలిగిం దని నమ్మి.. విదేశాలనుంచీ జనాలు రావడం పెరిగింది. ఒక గొప్ప క్షేత్రంగా నిలిచిపోయింది ఆ గుడి. ■

## శైలజా మిత్ర



ముప్పై ఏళ్లుగా.. అటు వృత్తిని, ఇటు ప్రవృత్తిని తెలుగు సాహిత్యానికి అంకితం చేశారు రచయిత్రి శైలజా మిత్ర. స్వస్థలం చిత్తూరు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఎంఏ (తెలుగు, ఆంగ్లం) చదివారు. కాలేజీ రోజుల నుంచీ రచనలు చేస్తున్నారు. వీరి మొదటి కథ 'ఆదర్శాల అంచుల్లో' ఆంధ్రభూమి సచిత్ర వార పత్రికలో ప్రచురితమైంది. ఇప్పటివరకూ 10 కవితా సంపుటాలు, 3 కథా సంపుటాలు, 4 నవలలు, 12 అనువా దాలు (తెలుగు నుంచి ఆంగ్లం), పిల్లల కథలు, ఒక నవల, ఒక మినీ కవితల సంపుటి, 824 గ్రంథాల సమీక్షలు, విమర్శనా వ్యాసాలు, 46 ఆధ్యాత్మిక, సామాజిక వ్యాసాలు రాశారు. అన్ని ప్రధాన పత్రికలు, వెబ్‌సైట్లలో వీరి అనేక కథలు, కవితలు, నవలలు ప్రచురణకు నోచుకు న్నాయి. సాహిత్యసేవలో భాగంగా రాష్ట్ర, జాతీయ స్థాయిలో యాభైకిపైగా పురస్కారాలు అందుకున్నారు. కొన్ని ప్రతిష్ఠాత్మకమైన కథల పోటీలకు, కవితల పోటీలకు న్యాయనిర్ణేతగానూ వ్యవహరించారు. వివిధ సాహిత్య సంస్థలకు కార్యదర్శిగా పనిచేశారు.